మనిషి!'' అని మనసులోనే తిట్టుకుని చక్కా వచ్చేశాం కూతుళ్ళమంతా.

''ఏమే అమ్మాయిలూ! నా కర్మకి వచ్చారిదిలేస్తారులే...? నాగతి ఇంక అధోగతే నటే ?'' అని గోడు గోడు మంటూ మళ్ళీ ఉత్తరాలు రాసింది మా అమ్మ. మా ముగ్గురు అక్కయ్యలు కన్నీళ్ళతో మొర పెట్టుకుని ... మా బావల్ని మా నాన్న దగ్గరికి రాయభారం పంపారు - బుద్ధి గరప టానికి. వాళ్ల ముగ్గుర్నీ ముక్కచీవాట్లేసి పంపాడట మా నాన్న.

''ఏమయ్యా ? మీ పెళ్ళాల్నేలు కుంటు న్నారా ? లేక విడిచి పెడుతున్నారా ? మీరు ''బారు'' కెడుతున్నారా లేకపోతే బజారు భామినుల దగ్గర కెడుతున్నారా ? అని నేనెప్పుడన్నా మిమ్మల్ని అడిగానుటయ్యా ? తగుదునమ్మా! అంటూ వచ్చారు మీకేమన్నా బట్టలు కుట్టించుకోవాలని మోజుంటే అంతా తలా అయిదొందలు పట్టుకెళ్ళండి! అంతేగాని నా స్వంత విషయాల్లో జోక్యం కలిగించుకోకండి — తాతకి దగ్గులు నేర్పినట్టుగా. మీ అత్త నా పెళ్ళాం! నా యిష్టం! నేను తిట్టినా, కొట్టినా, బజారు పరుకుతో పోయినా, పతివ్రతా ధర్మాన్ననుసరించి ఆరు మూసు కుని పడివుండాల్సిందే!'' అన్నాట్ట.

''మొండి ముండావాడు!'' అని లోలో పలే తిట్టుకుని తిరిగి వచ్చేశారట మా బావయ్యలు. ఇప్పుడు మా అమ్మ బాధగా

# మామా-అల్లుడు

రాసిన ఉత్తరంలోని సంగతేమిటో తెలుసా?'' మళ్ళీ ఆగింది ఇందు.

''అబ్బా! ఇందూ చెప్పు త్వరగా'' తొందర పెట్టాడు రామారావు.

నలుగురు కూతుళ్ళ... మొదటి ముగ్గురల్లుళ్ళా నా కన్నీళ్ళ వాకే మిగిల్చారు! ఇకపోతే... మీ ఆయనొక్కడే మిగిలింది... పైగా మీ ఆయన రచయిత కదా! నాటికలు గట్రా రాస్తాడు గదా! ఏదైనా మార్గం ఆలోచించి మావగార్ని తప్పుదారిలో పడకుండా చెయ్యమను. ఇన్నా ళ్ళుగా రాకపోయినా... ఈ ఒక్కసారయినా దయచేసి వచ్చి మీ మావగారితో మాట్లాడి వారిని సరిదిద్దమను. ఇక మీ ఆయన కూడా చెయ్యలేకపోతే నాకు నుయ్యో... గొయ్యో... శరణ్యం వుండనే వుంది అని రాసిందండీ! మా అమ్మ!''

మళ్ళీ కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిప్పు కుందిఇందు.

పమిట కొంగుతో ఆమె కన్నీళ్ళద్ది - ధైర్యం చెప్పాడు రామారావు. ''నట్టనప్పు డెలా వున్నా ... ఆపదలో ఆదుకోటం మానవత్వం. నువ్వు ధైర్యంగా వుండు! ఏదో ప్లాను ఆలోచించి... ప్లానువేసి... మావగారి ఆట కట్టిస్తాగా...! ఏదీ? ఒక్క సారి నవ్వు...'' అన్నాడు.

ఆ సినిమా డైలాగుకి అచ్చం సినిమా హీరోయిన్ నవ్వినట్టే నవ్వింది ఇందు.

''ఒక్క నవ్వే చాలదమ్మాయ్! ఒక్క ము ... కూడా!'' హాస్యరు సరుస్తూ అన్నాడు రామారావు

''ఛీ! పొండి! మీకు వేళాపాళా లేదు'' అని ఈసారి ఇందు సినిమా డైలాగు పలి కటం రామారావు ఆ ముద్దు మూడుసార్లు తీర్చుకోటం రెండు క్షణాల్లో జరిగిపోయింది. బరువెక్కిన వాతావరణం ఆ విధంగా తేలికై పోయింది.

* * *

''ఇందూ! ఆఫీసుకు మూడురోజులు సెలవు పెట్టేశాను. మావగారి శృంగభంగా నికి చక్కని పథకం ఆలోచించాను. ఇవ్వాళే మన ప్రయాణం. ఓ అరగంటలో రడీ అవ్వు''

నీరసంగా మొహం పెట్టింది ఇందు. కంగారు పడిపోయాడు రామారావు.

''మా నాన్నని మీరు మార్చగలరం టారా ?'' సందేహం వెలిబుచ్చింది.

''ఓస్! ఇంటేనోయ్ నీ అనుమానం ?! నాలోని నాటికా రచయిత మీద నీకేమి నమ్మకం లేనట్టుందే. చూస్తుండు! మావగార్ని రెండు రోజుల్లో మూడు చెరువుల నీళ్ళు తాగించి అత్తగారి కొంగు పుచ్చుకు తిరిగేట్టు చేస్తాను'' అన్నాడు రామారావు సగర్వంగా.


''ఏమో! అంతా శ్రీవారిదే భారం''

అరగంటలో బయలుదేరి గుడివాడ బస్సె క్కారు రామారావు ఇందులు.

మధ్యాహ్నానికల్లా మావగారింటికి జేరాడు రామారావు అర్ధాంగితో సహా.

రామచంద్రయ్యగారు అప్పుడే భోజనం చేసి పడక్కుర్చీలో విశ్రాంతి తీసుకుంటు న్నాడు. సీతమ్మ ఆయన పక్కగా నేలమీద కూర్చుని ఏవో కుటుంబ విషయాలు ముచ్చటిస్తోంది.

ఉత్తరం పత్తరం లేకుండా వాకిట్లో రిక్షా దిగుతున్న అల్లుణ్ణీ కూతుర్నీ చూసి రామచంద్రయ్యగారు - సీతమ్మలు నిర్ఘాంత పోయారు. ఉలిక్కిపడ్డ రామచంద్రయ్య గారు రెండు క్షణాల్లో తేరుకుని ''రండి అల్లుడుగారు! రండి!'' అంటూ అమిత మైన మర్యాద చేశారు. ''కులాసాయేనా? అల్లుడుగారూ!'' అని పలకరించి - కూతురి భుజంమీద ప్రేమగా చెయ్యేసి లోపలికి తీసు



వెళ్ళింది సీతమ్మ. రిక్షావాడు సామాన్లు లోపల పెట్టి డబ్బులు తీసుకుని వెళ్ళిపోయాడు. రామారావు ఇవ్వబోతుంటే వారించి తను ఇచ్చి పంపేశారు రామచంద్రయ్యగారు.

"ఏం కాకా పడుతున్నావురా? నాయనా? అన్నీ దొంగవేషాలు - శృంగార నాయకుడు!" అనుకున్నాడు రామారావు మనస్సులో.

ఓ అరగంటలో కూతురి సహాయంకూడా తీసుకుని పంచభక్ష్య పరమాన్నాలు తయారు చేసింది సీతమ్మ. భోజనాలదగ్గిర అల్లుడికి కొసరి కొసరి వడ్డింపజేశారు రామచంద్రయ్యగారు.

భోజనాలయిన తరువాత రామారావుకీ, ఇందుకీ-ప్రత్యేకమైన గది చూపించి రెస్టు తీసుకోమన్నారు. భుక్తాయాసంగా వున్న రామారావుకి కునుకు పట్టేసింది. ఇందు మీద చెయ్యేసి నిద్రలోకి జారిపోయాడు. అయిదుగంటలకల్లా తట్టి లేపింది ఇందు. "ఏమిటోయ్?" అన్నాడు రామారావు బద్ధకంగా లేచి ఒళ్ళు విరుచుకుంటూ.

"అవిగో! వాటిని చూడండి" అంది అక్కడున్న టేబులు మీద పెట్టినవి చూపిస్తూ.

టెరీవూల్ పాంటింగు క్లాత్ - టెరిన్ షర్టుపీసు - ఓ ట్రాన్సిస్టరు - ఓ ఆటోమాటిక్ వాచీ.

ఎగిరి గంతేసినట్టయింది రామారావుకి. సంతోషంతో కాదు-ఆశ్చర్యంతో.

"ఎవరికివన్నీ?" అన్నాడు విస్మయంగా.

"ఇంకెవరికో అయితే మీ కెందుకు చూపిస్తాను. ఇవన్నీ మీకేట. మా నాన్న బజారుకెళ్ళి పెట్టుకొచ్చారు."

'నా కిష్టం వుండదని నీకు తెలీదూ' అని రామారావు ఏదో అనబోతున్నాడు.

అతన్ని చెప్పనియకుండానే అతని మొహం దగ్గరకి లాక్కుని గొంతు తగ్గించి చెప్పింది ఇందు.

"తీసుకోనంటే మా నాన్నకి అవమానమొచ్చి వ్యవహారం బెడిసిపోతుంది. అందుకని వీటిని దయచేసి తప్పక స్వీకరించండి. అంతే కానీ మా నాన్న కాకాలో మాత్రం పడకండి. ఇవన్నీ ఎర జూపించి మిమ్మల్ని మంచి చేసుకుని తను మంచి వాణ్ణనిపించుకోవాలని చూస్తున్నాడు. మీరు అదేమీ నమ్మకండి. దేనిదారి దానిదే. మీ పథకం ప్రకారం కానీయండి" ముఖ్యంగా మావగారు... అసలైన అత్తగారు మరీ మరీ బలవంతం చేయటంతో అర్ధాంగి హెచ్చరిక గుర్తురావటంతో తీసుకోక తప్పలేదు రామారావుకి. పరిస్థితిని ఒకసారి సమీక్షించుకుని... తన ప్లాను రేపు ప్రయోగిద్దామనుకున్నాడు రామారావు.

మరునాటి రోజు సాయంత్రం చల్లని గాలులు వీస్తున్నవేళ - కనుచీకట్లు ముసురుకుంటున్నవేళ ఇద్దరూ డాబామీద కూర్చున్నారు.

"మావగారూ! ఇన్నాళ్ళూ నేను మిమ్మల్నేమీ అడగలేదు. ఇవ్వాళ నోరు తెరిచి అడుగుతున్నాను. నా కోరిక తీర్చాలిమీరు."

---

## "చరమాంకం"

– వేమకోటి

నటించలేను ; నటించలేను
ఈ జీవితం మధ్య ఉండలేను
నిజాయితీ లేని నిండు గుండెల మధ్య
మమకారం లేని మానవతల మధ్య
నేను మనలేను ; ఏమనలేను.
నాలో ప్రవహిస్తున్న చీమూ నెత్తురు,
యిన్నాళ్ళుగా జ్వలించిన మేధస్సు
యివన్నీధర్మాగ్రహంలో చిక్కుకున్నాయి
స్వార్థం, సంస్కారాన్ని
ముద్దు పెట్టుకుంటూ,
సమాజానికి అహం రంగుపులుముతోంది.
నేను దానికి బానిస కాకుండానే
పలాయనమే చరమాంకమని
తెలుసుకున్న జీవితంలో
నేను నటించలేను;మరి నటించను.

---

"ఏమిటో అడుగు బాబూ! ఇన్నాళ్ళకు మా యింటికి వచ్చావు. నిన్ను కాదంటానా? ఏం కావాలి రాలీ సైకిలు కావాలా? బజాజ్ స్కూటర్ కావాలా?"

"ఛ! అవేమీ వద్దు మావగారూ! వాటిలో ఏం మజా వుంటుంది!"

ఆశ్చర్యపోయారు రామచంద్రయ్యగారు. ఇదేమిటి అల్లుడి ధోరణిలా వుంది?!

"ఏం నటిస్తున్నావురా ముసలినక్కా నీ వంగి వంగి వేషాలు నా దగ్గర కాదు. నేను నాటికా రచయితను మిస్టర్" స్వగతం పలుక్కున్నాడు - రామారావు.

"చెప్పు బాబూ" అన్నారు.

"నాకు మీ అమ్మాయి దగ్గర సుఖం పాతబడిపోయింది. బజారుచిలకలు కావాలి" ధైర్యంచేసి అనేశాడు రామారావు - కాదు నాటికా రచయిత.

దాదాపు అరిచినట్టుగా అన్నారు రామచంద్రయ్యగారు.

"అల్లుడూ! మతి వుండే మాట్లాడుతున్నావా? నా కన్నతల్లికి అన్యాయం చెయ్యకు."

"ఏం చెపుతారు మావగారూ? మీరు అత్తగారికి అన్యాయం చెయ్యటంలా? పార్వతీదేవిలాంటి అత్తగారేం పాపం చేసిందని ఆమెనలా చిత్తక్షోభకి గురిచేస్తున్నారు?"

"బాబూ! రామారావ్! ఏమిటి నువన్నేది? నేను మీ అత్తగారికి..."

"తెలియనట్టు మాట్లాడకండి. మీ చేతిలో డబ్బువుంది - మీ వంట్లో ఓపికుంది - మిమ్మల్ని కులాసాల్లో తేల్చే విలాసినులు కావాలటగా?"

మీరు అత్తగారికి ఆమె చేతనయింది చేసుకోమని గడువిచ్చారటగా. నేనూ వస్తాను మీతో. మీకు అత్తగారు కాకుండా కొత్త ప్రియురాలు ఎలా కావాలో నాకు ఇందు కాకుండా మరో ఇందువదన కావాలి పదండి ముందుకు! పదండి తోసుకు! వ్యభిచార గృహాల్ని పావనం చేద్దాం!" ఆవేశంగా అన్నాడు రామారావు. అతనిలోని రచయిత ఉబికి ఉబికి వస్తున్నాడు బయటికి.

"అల్లుడూ! ఈ రామచంద్రయ్యంటే ఏమనుకుంటున్నావో...ఏమో...?సాక్షాత్తూ శ్రీరామచంద్రుడి లాంటివాడు. ఏకపత్నీవ్రతుడు! పరస్త్రీతో పొందు కలలో కూడా ఒప్పుకోడు. ఎవరు నీతో నా గురించి అలా చెడుగా చెప్పింది?" రామచంద్రయ్యగారి కోపం తారాస్థాయి నందుకుంది. ఆవేశంతో వణికిపోతున్నారాయన.

"అయితే మీ అమ్మాయి అలా చెప్పిందేమిటిచెప్మా?!" స్వగతంగా అనుకోవాల్సిన మాటల్ని పైకే అనేశాడు రామారావు.

"మా అమ్మాయా? మై గాడ్! నేను నమ్మను" దృఢంగా అన్నారు రామచంద్రయ్యగారు. ఇంత వరకూ వచ్చిన తర్వాత వ్యవహారంపూర్తిగా తేల్చుకో దల్చుకున్నాడు రామారావు.